# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శనివారం 18 జూలై 2026


## మదనపల్లి ఎస్పీ కార్యాలయంను తనిఖీ చేసిన డిఐజి



**మదనపల్లె క్రైమ్ జూలై 17 ప్రభాతవార్త.**

మదనపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయం, వాల్మీకిపురం పోలీస్ స్టేషన్ లను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం డిఐజి మొదట మదనపల్లె జిల్లా ఎస్పీ కార్యాలయంకు చేరుకున్నారు. డిఐజికి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎస్పి కార్యాలయంలో జరుగుతున్న నూతన భవన నిర్మాణాలను డిఐజి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అక్కడే నుంచి వాల్మీకిపురం, గుర్రంకొండ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు.

## నీట్ ఫలితాల్లో విధ్యార్థిని 560 మార్కులతో సత్తా చాటిన పి.తేజస్విత



**వేంపల్లె, జూలై 17, ప్రభాతవార్త:**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ 2026 ఫలితాల్లో స్థానిక నారాయణ విద్యా సంస్థ విధ్యార్థిని ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ కె.నారాయణ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా 720 మార్కులకు గాను పాఠశాల విధ్యార్థిని పి.తేజస్విత 560 మార్కులతో జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ విధ్యార్థిని తేజస్విత క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఈ విజయాన్ని సొంతం చేసుకుందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు వివిధ పోటి పరిక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో తమ పాఠశాలకు చెందిన విధ్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే విధ్యార్థిని ప్రతిభ పట్ల అభినందిస్తూ భవిష్యత్ లో మెడిసిన్ పూర్తి చేసి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షి ంచారు.

# జాడ లేని చినుకులు

## నామ మాత్రం ఖరీఫ్ సాగు



**పీలేరు, జూలై 17 ప్రభాతవార్త:**

గత కొన్నేళ్లుగా నైరుతి రుతుపవనాలు దోబూచులాట ఆడుతూ వస్తున్నాయి. అతివృష్టి లేదా అనావృష్టితో సంభవిస్తూ తీవ్ర నష్టాన్ని మిగిల్తున్నాయి. ఎప్పటిలాగే ఈ ఏడాది రుతుపవనాలు సీజన్ ఆరంభంలో ఊరించి వర్షాలు సీజన్ చివరకు వచ్చే సమయానికి మొండి చేయి చూపుతున్నాయి. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో కురిసిన అరకొర వర్షానికి తమ పంట పొలాలను దుక్కులు చేసుకొన్నా వర్షం జాడ కనపడలేదు. అదనుకు పదును వర్షం కురిస్తేనే వర్షాధార పంటైన వేరుసెనగ సాగు ముందుకు కదిలేది. జూన్ నెలలో అక్కడక్కడ పదును వర్షమే కురిసింది. ఆ సమయంలో రాయితీ విత్తన కాయలు అందలేదు. నీటి ఆదరువు ఉన్న రైతులు మాత్రం బయట విత్తనాలు కొనుగోలు చేసుకొని అక్కడక్కడ పంట సాగు చేశారు. మిగతా రైతులు మేఘాల వైపు చూస్తూ వర్షం ఎప్పుడు కురుస్తుందా అని ఎదురు చూస్తున్నారు. వరుణ దేవుడి కటాక్షం కోసం రైతులు బొడ్రాళ్లకు పూజలు చేయడం, ఈ సీజన్ లో కురిసిన అరకొర వర్షానికి రైతులు పంట సాగుకు అన్నీ సిద్ధం చేసుకొన్నారు. తీరా జూన్ నెలలో 75.1 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా నెల మొత్తం 52.4 మి.మీ వర్షం నమోద్వైంది. ఇంకా 32.4 మి.మీ వర్షం తక్కువగా నమోద్వైంది.

**జిల్లావ్యాప్తంగా కప్పదేవరలు**

సకాలంలో వర్షాలు కురవాలని జూన్ జూలై మాసాల్లో సాధారణంగా అన్ని దేవాలయాల్లో జాతరలు, దేవర్లు నిర్వహిస్తూ ఉండడం ఆనవాయితీ. దుక్కి దున్నిన పొలం అభిషేకాలు, ఊరి దేవతలకు ఉత్సవాలు జరిపిస్తున్నారు.

**ఎల్ నీ నో ప్రభావంతోనే ఈ పరిస్థితి.**

ఎల్‌నీనో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని, ఈ వాతావరణ పరిస్థితులు తట్టుకొని వ్యవసాయం సాగు చేయాలని వ్యవసాయ అధికారులు ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిసున్నారు. కురుస్తున్న వర్షాలు కూడా కొన్ని ప్రాంతాల్లోనే నమోద్వైంది. మరికొన్ని ప్రాంతాల్లో లేదని రైతులు అంటున్నారు. అదీ కూడా ఐదు రోజులు తక్కువగా వర్షం కురిసినా అందులో పదును వర్షం పడిన రోజు లేదు.

**ఇప్పటికి సాగు 600 హెక్టార్లే**

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజ నులో 40 వేల హెక్టార్లలో వేరుసెనగ సాగు కావాల్సి ఉండగా నేటికి 600 హెక్టార్లు మాత్రమే సాగైంది. ఎల్‌నీనో ప్రభావంతో సరైన వర్షాలు కురవకపోవడంతోనే సమస్య ఏర్పడింది. ప్రభుత్వం కూడా జిల్లాకు 36,450 క్వింటాళ్ల రాయితీ విత్తనకాయలు కేటాయించింది. ఇప్పటి వరకు 20 వేల క్వింటాళ్లను పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతు న్నారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయాధికారి జి.శివనారాయణ మాట్లాడుతూ.. వేరుసె నగ పంటను ఈ నెల 15 వరకు సాగు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు తక్కువగానే సాగైంది. వర్షాభావ పరిస్థితులతోనే సాగు కాలేదు. వర్షాలు కురిస్తే పెరుగుతుంది.

**జిల్లాలో పరిశీలిస్తే**

జిల్లాలోని 25 మండలాల్లో పరిశీలిస్తే గాలివీడు, మదనపల్లె, రామసముద్రం మండలాల్లో జూన్ లో కురవాల్సి న వర్షం కంటే కాస్త ఎక్కువగా నమోద్వైంది. మిగతా 22 మండలాల్లో తక్కువగా నమోదు కావడం గమనార్హం. జూలై చివర వరకు కూడా వేరుశనగ విత్తనాలు పెట్టుకునే అవకాశం ఉందని, అలాకానిపక్షంలో నీరు తక్కువ అవసరం ఉన్న పంటలు సాగు చేయాలని ఇదే మంచి జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ తెలిపారు.

# విరూపాక్షమ్మ తల్లి ఉత్సవాల్లో 2రోజు ప్రత్యేక హోమం

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి దంపతులు



**రాయచోటి, జూలై 17 ప్రభాతవార్త:**

రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం పడమటికోన గ్రామ పంచాయతీ పరిధిలోని బోరెడ్డి గారిపల్లి గ్రామంలో వైభవంగా కొన సాగుతున్న శ్రీ విరూపాక్షమ్మ తల్లి ఉత్స వాల 2రోజు కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సతీమణి హరితమ్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ప్రత్యేక హోమ, యజ్ఞ కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సు లు పొందారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సస్యశ్యామలత కలగాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన, సతీమణి హరితమ్మలు భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేసి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్స వాలకు విచ్చేసిన భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గారి కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రతి నియోజకవర్గంలో సదస్సులు

## ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం : జాయింట్ కలెక్టర్ నిధి మీనా




**రాజంపేట, జూలై 17 ప్రభాతవార్త:**

ప్రజల రెవిన్యూ సమస్యల పరిష్కారానికే నియోజకవర్గ వ్యాప్తంగా సదస్సు లు నిర్వహిస్తున్నామని, ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని, ప్రజల వద్దకే వచ్చి సమస్యలు పరిష్కరించడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని కడప జాయింట్ కలెక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తోట కళ్యాణ మండపంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూ సమస్యల పరిష్కార వేదికలో ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన, కూటమి నేతలు చమర్తి జగన్మోహన్రాజు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యక్తంగా ప్రజలు సమస్యల పరిష్కారం కోసం తరలివచ్చి అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పరిశీలిస్తామన్నారు. పరిష్కారానికి అవకాశం ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. లేదంటే ఎందుకు పరిష్కారం కాదో చెబుతామన్నారు. టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు రెవెన్యూ భూ సమస్యల పరిష్కార కార్యక్రమం ప్రజలకు ఏంతో మేలు అన్నారు. ప్రజల వద్దకే అధికారులు రావడం, సమస్యలు పరిష్కరించడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రాజంపేట నియోజకవర్గ రెవెన్యూ సమస్యలకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ వేదిక ఎంతో దోహద పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుంది. భూముల అవినీతి అక్రమాలపై ఊరుకునే ప్రసక్తే లేదనీ స్పష్టం చేశారు. ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన అధికారులకు ధన్యవాదములు తెలిపారు.

# ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి

## ప్రజాదర్బార్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి, జూలై 17 ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం పడమటి కోన గ్రామం బొరెడ్డిగారిపల్లెలోని తన సొంత నివాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను మంత్రికి అందజేయగా, వాటిని మంత్రి గారు ఓర్పుగా ఆలకించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడిపాల్గొని ప్రజల సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మద్యంషాపుల వద్ద హల్చల్ చేస్తున్న కానిస్టేబుల్

## అధికారులకు ఫిర్యాదు చేసిన షాపు యజమానులు

## చర్యలు తీసుకోవాలని కోరుతున్న అధికారులు



**బద్వేలు, జూలై 17 ప్రభాతవార్త:**

పట్టణంలోని అర్బన్ పోలీసుస్టేషన్లో పనిచేస్తున్న ఓ కాని స్టేబుల్ గత 2 రోజులు గా మద్యం షాపుల వద్ద హల్చల్ చేస్తూ ఆయాషాపుల యజ మానులను భయ బ్రాంతులకు గురిచేయడంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. షాపులలో మద్యం తాగించలేదని, పోలీసులంటే లెక్కలేదా అంటూ మీకు డిఎస్పి, ఎస్పి, సిఐలు తప్ప మేము కనపడమా అంటూ షాపుల యజమానులను బెదిరించారని తెలిపారు. దీంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అతను గత కొద్ది రోజులుగా ఇదేరీతిలో భయ బ్రాంతులకు గురి చేస్తున్నాడని సంబంధిత అధికారులు ఇతనిపై చర్యలు చేపట్టాలని ఆయా షాప్ ల యజమానులు కోరుతున్నారు.

# అవినీతిపై విమర్శలు చేసే అర్హత వైసిపికి లేదు

## రాష్ట్ర స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్



**ప్రొద్దుటూరు జూలై 17 ప్రభాతవార్త**

రాష్ట్రంలో గత వైసిపి పాలనలో విచ్చలవిడిగా దోచేసిన కూటమి ప్రభుత్వం లో అవినీతిపై విమర్శలు చేసి అర్హత వైసిపికి లేదని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్‌బి భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సుమారు రూ.11.50 కోట్లతో ఆధునిక వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, అలాగే రూ.16 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 107 వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాల్లో ఒకటి ప్రొద్దుటూరులో నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని డంప్‌యార్డ్‌లేని రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, వైసీపీ హయాంలో చెత్త నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, రాష్ట్రంలో దాదాపు ఒకటిన్నర కోట్ల టన్నుల చెత్త పేరుకుపోయిందని ఆరోపించారు. చెత్తపై పన్ను విధించిన ప్రభుత్వం వైసీపీదేనని, ప్రజలు ఇప్పటికే వారికి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేస్తున్న విమర్శలు ఆధారరహితమని పేర్కొంటూ, వైసీపీ పాలనలో రాయలసీమ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాయలసీమకు రూ.4.50 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు తీసుకువచ్చిందని, సాగునీటి ప్రాజెక్టులకు గత ప్రభుత్వంతో పోలిస్తే వేగంగా నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి నాయకత్వంలో ప్రొద్దుటూరును పరిశుభ్రమైన, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగుతుందని పట్టాభిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ పర్వీన్ భాను, టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్తియార్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు ఖలీల్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్లపురెడ్డిపల్లి పంచాయతీలో

# భారీగా అవినీతి

- మాయమైన బోరు పైపులు, విద్యుత్ కేబుళ్లు
- నెలలుగా వెలగని వీధిలైట్లు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- ప్రభుత్వ ఆస్తుల దుర్విని యోగంపై సమగ్ర విచారణ చేయాలి
- టీడీపీ నేత యోగనంద రెడ్డి డిమాండ్



స్థానిక ప్రజల సమస్యల గురించి తెలుసుకుంటున్న టిడిపి నేత యోగానంద రెడ్డి

**పులివెందుల, జూలై 17 ప్రభాత వార్త :**

పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లి గ్రామపం చాయతీలో ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం, అవినీతి జరిగిందని 1,200 అడుగుల బోరులో 600 అడుగుల పైపులు, కేబుళ్లు మాయమయ్యాయి అని విద్యుత్ కేబుళ్లు కనిపించకుండా పోవడంతో పాటు గ్రామంలోని అనేక వీధిలైట్లు నెలలుగా పనిచే యక గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు అని ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత యోగనంద రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకవర్గం హయాంలో సుమారు 1,200 అడుగుల లోతుతో ఏర్పాటు చేసిన బోరుబావుల్లో ప్రస్తుతం 400 నుంచి 450 అడుగుల వరకు మాత్రమే నీరు అందుతోందన్నారు. మిగిలిన సుమారు 600 అడుగుల పైపులు, విద్యుత్ కేబుళ్లు తొలగించారని ఆరోపించారు. ఆ సామగ్రి ఏమైందో అధికారులు ప్రజలకు వెల్లడించాలని కోరారు. గ్రామంలోని పలు వీధిలైట్లు పనిచేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బం దులు పడుతున్నా రని, పంచాయతీలో కనీస మౌలిక సదుపాయాల నిర్వహణ కూడా నిర్లక్ష్యానికి గురైందని స్థానికులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన సామగ్రి మాయమవడం వెనుక అవినీతి జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమగ్ర విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## బెట్టింగ్ బాద్‌షాలకు..

# ప్రొద్దుటూరు అడ్డా!

- గల్లా గల్లీకీ బుకీలు..యాప్‌లలో పందేలు
- పోలీసులంటే భయం లేదు.. రాజకీయ అండదండలే ధైర్యమా?
- ఫ్యాన్సీ బెట్టింగ్ మాయలో యువత - లక్షల్లో అప్పులు

**ప్రొద్దుటూరు క్రైం, జులై 17, ప్రభాతవార్త:**

క్రికెట్ బెట్టింగ్ దందాకు ప్రొద్దుటూరు అడ్డాగా మారుతోందా? నగరంలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. మ్యాచ్ ఏదైనా.. పందేం మాత్రం ఉండాల్సిందే అన్నట్లుగా బుకీలు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్-ఇండియా జట్ల మధ్య వస్తే మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్ దందా మళ్లీ జోరందుకున్నట్లు సమాచారం. ఐపీఎల్ ముగిసిన తరువాత కొంత కాలం తెరవెనక ఉన్న బుకీలు.. ఇప్పుడు తిరిగి తమ కార్యకలాపాలను విస్తరించినట్లు తెలుస్తోంది.

**బుకీలకు 'బంగారు బాట'**

వాణిజ్య కేంద్రంగా పేరొందిన ప్రొద్దుటూరులో క్రికెట్ పందేలు కూడా పెద్దఎత్తున సాగుతున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు బెట్టింగ్ ఆడేందుకు బయట ప్రాంతాలకు వెళ్లిన యువత.. ప్రస్తుతం స్థానికంగానే పందేలు కాస్తున్నారు. మొబైల్ ఫోన్లలో యాప్‌లు.. వాట్సాప్ గ్రూపులు.. ఆఫ్‌లైన్ బెట్టింగ్.. ఇలా పలు మార్గాల్లో దందా సాగుతున్నట్లు సమాచారం. గల్లీ గల్లీకి పదుల సంఖ్యలో బెట్టింగ్ రాయుళ్లు ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. మ్యాచ్ ప్రారంభం కాకముందే పందేలు మొదలువుతండగా మ్యాచ్ సాగుతున్న కొద్దీ ఫ్యాన్సీ బెట్టింగ్‌ల పేరుతో మరింత ఉదృతం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరు గెలుస్తారు..? ఎవరు ఓడతారు..? తొలి ఓవర్‌లో ఎన్ని పరుగులు..? ఒక బ్యాట్స్‌మెన్ ఎన్ని పరుగులు చేస్తాడు..? తదుపరి బంతికి ఏం జరుగుతుంది. ఇలా రక రకాల ఫ్యాన్సీ బెట్టింగ్‌లను బుకీలు తెరపైకి తెస్తున్నట్లు సమాచారం. యువత ఈ మాయలో పడి అప్పుల ఊబిలో కూరుకుపోయి తల్లిదండ్రులకు వేదన కలిగిస్తున్నారు. ఇప్పటికైనా బెట్టింగ్‌పై పోలీసులు ఉక్కుపాదం నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం : ఎంపీ


వార్త 2వ పేజీలో

## ప్రతిభకు పట్టాభిషేకం

### షైనింగ్‌స్టార్‌కు ఎంపికయిన విద్యార్థులు



చౌడేపల్లి, జూలై 17 ప్రభాతవార్త

విద్యారంగంలో ప్రతిభ కనబరచిన 5గురు విద్యార్థులు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక షైనింగ్‌స్టార్‌కు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన పది పరీక్షాల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభన కనబరచారు. విద్యార్థుల్లో ముగ్గురు విజవాయణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన వారు కాగా ఇద్దరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. చారాల కరణం యువతేజ్(591), జి.రమ్య(588), బాగేపల్లి సాయిశ్రీ(579), పి.మంజునాథ్(576)లు విజయవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, పరికిదొన ఉన్నత పాఠశాల యు.సింధులు ఎంపిక యినట్లు ఎంఇఓ కేశవరెడ్డి తెలిపారు. ఈనెల 20న మదనపల్లి ఎన్‌జెఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులు ప్రధానం చేస్తారన్నారు. ఈ వేడుకలో ఎంపికయిన 5గురు విద్యార్థులకు రూ. 20వేల నగదు తోపాటు ప్రశంసాపత్రం, పతకంతో సత్కరిస్తారన్నారు. పిల్లల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## మరమ్మతులకు నోచుకోని పార్క్ జిమ్ పరికరాలు

### పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు



రాయచోటి టౌన్, జూలై 17, ప్రభాతవార్త :

అన్నమయ్య జిల్లా రాయచోటి లోని పాత డైట్ హాస్టల్‌లో గల పార్కులో జిమ్ పరికరాలు మరమ్మతులకు నోచుకోక కొన్ని నెలలు గడుస్తున్నప్పటికీ అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరించడంతో పార్కుకు నిత్యం వచ్చి పోయే ప్రజలు యువత, మహిళలు పలు ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో లక్షలాది రూపాయలు వెచ్చించి పార్కు లో వాకింగ్ ట్రాకు జిమ్ పరికరాలు చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలు తదితర వన్నీ ఏర్పాటు చేయగా వాటన్నిటిని పార్కు వచ్చిపోయే ప్రజలు యువత మహిళలు ఇష్టానుసారంగా ఎలా పడితే అలా ఉపయోగించడంతో అవి విరిగిపోయి పాడైపోవడంతో అప్పటినుంచి ఎవరు పట్టించుకోలేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. నిత్యం ఈ పార్క్ కు వందలాదిమంది ఉదయం సాయంత్రం వేళలో రావడంతో పార్కు ప్రజలకు చాలా వరకు ఉపయోగంగా ఉన్నప్పటికీ అక్కడ ఉన్నటువంటి జిమ్ పరికరాలు ప్రజలకు అసౌకర్యంగా ఉండడమే కాకుండా పాడైపోయిన పరికరాలను ఉపయోగించుకుంటూ ప్రమాదానికి కూడా గుర అయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు పేర్కొన్నారు ఇప్పటికైనా సంబంధిత మున్సిపాలిటీ అధికారులు తగు చర్యలు తీసుకొని మరమ్మత్తులు చేయించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

## పెద్దేరు ఆయకట్టు గిరిజన రైతుల పంటలకు సాగునీరు విడుదల

### పెద్దేరు ప్రాజెక్ట్ చైర్మన్ కొటాల శివకుమార్



తంబళ్లపల్లె జూలై 17 ప్రభాతవార్త ః

పెద్దేరు ప్రాజెక్ట్ ఆయకట్టు లోని గిరిజన రైతులకు చెందిన సుమారు 100 ఎకరాల పలు రకాల పంటలకు శనివారం సాగునీరు విడుదల చేస్తున్నట్లు పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్, కమిటీ సభ్యులు తీర్మాణించారు.ప్రాజెక్టు పరిధి పెద్దమండెం మండలంలోని దేనేనాయక్ తండా,అవికే నాయక్ తాండ, వడ్డివంక తండా, తుమ్మలవంక తాండా, గరుగుమీద తాండాలకు చెందిన రైతుల పంటలు ఎలినో ప్రభావంతో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న విషయాన్ని జిల్లా మంత్రి రాంప్రసాద్ రెడ్డి,బిజెపి రాష్ట్ర నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డిల దృష్టికి తీసుకువెళ్లగా వారి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పెద్దేరు ప్రాజెక్టు నుండి సాగు నీరు శనివారం ఒక్కరోజు విడుదల చేయాలని ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులు, ఆయ కట్టు కమిటీకి సూచించారు. గిరిజన రైతుల సమస్యల పరిష్కారానికి అందరి ఆమోదంతో చైర్మన్ శివకుమార్ తో పాటు కమిటీ మెంబర్లు శనివారం ఒక్కరోజు నీటి విడుదలకు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. ప్రాజెక్ట్ సాగునీటి విడుదల ప్రకటన పై గిరిజన రైతులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన ఎన్. మాన్యశ్రీకి



పీలేరు, జూలై 17 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 2026 పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రదానం చేస్తున్న "షైనింగ్ స్టార్స్ అవార్డు – 2026"కు పీలేరు శ్రీ భువన విద్యాలయానికి చెందిన విద్యార్థిని ఎన్. మాన్యశ్రీ ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ ఉమారమా దేవి మరియు ప్రిన్సిపాల్ ఏ. గుణలక్ష్మి విద్యార్థిని ఎన్. మాన్యశ్రీని అభినందిస్తూ, ఆమె సాధించిన ఈ ఘనత పాఠశాలకు గర్వ కారణమని పేర్కొన్నారు. ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా విద్యాశాఖ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులకు రూ.20,000 నగదు బహుమతి, ప్రశంసాపత్రం, పతకం ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం జూలై 20, 2026న ఉదయం 10 గంటలకు, మదనపల్లె పుంగనూరు రోడ్డులోని ఎన్‌జేఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఎన్. మాన్యశ్రీకి అభినందనలు తెలియజేస్తూ, ఆమె మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. అలాగే నియోజకవర్గంలోని కలికిరి పట్టణంలోని ఇండియన్ హై స్కూల్, 2026 ఎస్ ఎస్ ఈపరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన ది. గ్రీష్మశ్రీ (589) మరియు బి. సేహ (534) మారుట్రలు వీది కాటగరీల సాధించి షైనింగ్ స్టార్స్‌గా ఎన్నికైనందులకు కరస్పాండెంట్ జి. సుజాత, డైరక్టర్ ఆదినారాయ రెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు. గత సంవత్సరం (కె.గోవర్ధక రెడ్డికి అవార్డు వచ్చిందని తెలిపారు. ప్రతి షైనింగ్ స్టార్ అవార్డు గ్రహీతలకు 20 వేల రూపాయల నగదుతో పాటు కలెక్టర్ ప్రశంసాపత్రం అందజేస్తారు.

## జీవితం అమూల్యమైనది - ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



పీలేరు, జూలై 17 ప్రభాతవార్త:

పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో జీవితం అమూల్యమైనది – ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి అనే అంశంపై ఆత్మహత్య నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ రాజమ్మ అధ్యక్షత వహించారు. మానసిక ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు ఎదురై నప్పుడు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అవసరమైతే కుటుంబ సభ్యులు, స్నేహితులు, నిపుణుల సహాయం తీసుకోవాలని ఆమె సూచించారు. అలాగే టెలి మానస్ (14416), మహిళా హెల్ప్ లైన్ (181), చైల్డ్ హెల్ప్‌లైన్ (1098) వంటి సేవలను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పీలేరు, కాలకడ, కేవీపల్లి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఎన్.పి. స్వరూప, పి. స్వర్ణ, అక్కయ్య ఉమ (పీలేరు సూపర్‌వైజర్లు) మరియు శాంతా (కాలకడ సూపర్‌వైజర్) హాజరయ్యారు. ఆత్మహత్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామస్థాయిలో ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వారికి సకాలంలో సహాయం అందేలా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ "జీవితం అమూల్యమైనది – ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతిజ్ఞ చేశారు.

## వాతావరణ ఆధారిత పంటల బీమా గడువు జూలై 24 వరకు పొడిగింపు

### వేరుశనగ, పత్తి, అరటి, చెరకు రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలి మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి

పులివెందుల, జూలై 17, ప్రభాతవార్త :

వేరుశనగ, పత్తి, అరటి మరియు చెరకు పంటలకు సంబంధించిన వాతావరణ ఆధారిత పంటల బీమా నమోదు గడువును ఈ నెల జూలై 24వ తేదీ వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు కలిగే నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం ఈ వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన రైతులు గడువు ముగిసేలోపు సమీపంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాలు, రైతు సేవా కేంద్రాలు లేదా సంబంధిత బ్యాంకులను సంప్రదించి బీమా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని తమ పంటలకు బీమా రక్షణ కల్పించుకోవాలని వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి కోరారు. రైతులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పేకాట రాయుళ్లు అరెస్ట్

సంబేపల్లి జూలై 17 ప్రభాతవార్త:

సంబేపల్లి మండల పరిధిలోనీ మాదం వాండ్లపల్లి సమీప పొలాల వద్ద పేకాటరాయుళ్ల పై ఎస్సై రవికుమార్ శుక్రవారం పోలీసు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పేకాట ఆడుతున్న 7 మందిని పట్టుకొని వారి వద్దనుండి రూ 2530 రూపాయలు నగదు మూడు సెల్ ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలియజేశారు.

## రాబోయే 10 ఏళ్లలో అన్ని గ్రామాలకు ప్రకృతి వ్యవసాయం విస్తరన

### ఆర్‌వైఎస్‌ఎస్ సీనియర్ అడ్వైజర్ మురళీ



మదనపల్లె, జూలై 17 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి రాబోయే 10 ఏళ్లలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడమే రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్‌ఎస్) ప్రధాన లక్ష్యమని సంస్థ సీనియర్ అడ్వైజర్ మురళీ తెలిపారు. శుక్రవారం మదనపల్లి మండలం అంకిశెట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ సెంటర్ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిశెట్టిపల్లి విఓ 1 పరిధిలో మెంటార్ వై. లక్ష్మీ మ్మ ఏర్పాటు చేసిన ఏ గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ నమూనాను ఆయన పరిశీలించి అభినందించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుం దని, భూసారం పెంపొందుతుందని పేర్కొన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై, రసాయన ఎరువుల వల్ల కలిగే నష్టాలను వివరించి ప్రకృతి సాగు పద్ధతులపై అవ గాహన కల్పించారు. తదనంతరం జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం కార్యా లయంలో మెంటార్లు, రైతు శాస్త్రవేత్తలు, యువ రైతు సహాయకులతో భవి ష్యత్ కార్యాచరణపై మురళీ సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి సిబ్బంది చొరవ తీసుకుని ఎక్కువ మంది రైతులను ప్రకృతి సాగు వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్, వ్యవసాయ అధికారులు, పులివెందుల అకాడమీ ప్రతినిధు లు, ఆర్‌వైఎస్ ఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## టీబీ-ముక్తభారత్ అభియాన్ కార్యక్రమం విజయవంతం



కలికిరి, జూలై 17, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంట పల్లె పంచాయతీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీబీ–ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హెచ్‌హెచ్ ఎక్స్‌రే పరీక్ష కార్యక్రమాన్ని మేడికుర్తి వైద్యాధికారిణి ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాలు వయసు ఉన్న వారందరికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. 167 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ అధికారి ఆర్.నాగిరెడ్డి, ఎస్.టి.ఎల్.ఎస్.భూపతి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు సహిదా, గీత, షరీఫా, ఏఎన్ఎం మాధవి, ఆశా కార్యకర్తలు మంజుల, సుమలత, ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## డిజె సౌండ్ నిర్వాహకులు తప్పకుండా పోలీస్ వారి ఆంక్షలు పాటించాలి

### లేకుంటే చర్యలు తప్పవు డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటి టౌన్ జూలై 17 ప్రభాతవార్త

డిజె సౌండ్ సిస్టం నిర్వాహకులు తప్పని సరిగా పోలీసు వారి నిబంధనలు పాటించాలని నిభందనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని రాయచోటి డియస్పి కృష్ణ మోహన్ హెచ్చరించారు. రాయచోటిలో అన్నమయ జిల్లా జిల్లా డిజె సౌండ్ సిస్టం అసోషియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ అనుమతులతో డిజె సౌండ్ సిస్టం నిర్వహించాలని వాటి సౌండ్ పోలీసులు అనుమతించిన వరకే ఉపయోగించాలని సౌండ్ పెంచిన, రికార్డింగ్ నిర్వహించిన చర్యల తతప్పవని హెచ్చరించారు. అన్నమయ్య జిల్లా డిజె సౌండ్ సిస్టం ఏడాది కాలంలో చేసిన సేవలను కోనియాడారు. ఈ సంఘం ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకోని పోలీసుల నిబంధనలు అమలు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ సంఘాలు ఏర్పాటు చేసుకోని సంఘటితం అయితేనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్యఅతిధిగా టిడిపి జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు హాజరయ్యారు. డిజె సౌండ్ సిస్టం సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలు ఏర్పడినప్పుడు తన సహకారం ఎప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. దాతలకు డియస్పి కృష్ణమోహన్, టిడిపి నేత సుగవాసి ప్రసాద్ బాబు చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. డియస్పి, టిడిపి నేతను సంఘం నిర్వాహకులు సన్మానించారు.

## బయటపడిన పురాతన కాలం నాటి శాసనాలు

### విజయనగర రాజు రెండవ వెంకటపతి రాయలు వేయించినట్లు వెల్లడి!! శాసనంలో మెర గల చెరువు ప్రస్థానం !! ఆర్కలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ కె. మునిరత్నం రెడ్డి.



గాలివీడు. జూలై 17. ప్రభాత వార్త:

మండలంలోని నులివీడు పంచాయితీ కొత్త బండి వాండ్ల పల్లెకు సమీపంలోని శివాలయం వద్ద 1600 సంవత్సరం కాలం నాటి పురాతన శిలాశాసనాలు బయటపడినట్లు మైసూర్ కు చెందిన ఆర్కలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రీ. మునిరత్నం రెడ్డి పేర్కొన్నారు. గత మూడు నెలల క్రితం ఈ ప్రాంతానికి చెందిన రిటైర్ ప్రధానోపాధ్యాయులు కె వేణుగోపాల్ రెడ్డి ఈ శాసనాల గురించి తమకు సమాచారం అందించారని తెలిపారు. వారి సమాచారం మేరకు శుక్రవారం తాను తన బృందం ఈ ప్రాంతాన్ని సందర్శించి పురాతన శాసనాలను పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ శాసనాలను 1602 వ సంవత్సరంలో ఆనాటి విజయనగర రాజు అయిన రెండవ వెంకటపతి రాయలు వేయించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఈ శాసనంలో ఈ శాసనానికి సమీపంలోని మెరగాల చెరువు గురించి ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతం సీమలోని నూలువీటి ప్రాంతంలో ఉన్నట్లు తెలిపారు.మేరగల చెరువును ఆనాటి విజయనగర రాజులు పునర్నిర్మాణంలో భాగంగా తూము, మొరవలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆనాటి రెడ్లు ,కర్ణాలు మేరగల చెరువు కింద సాగుచేసిన రైతుల దగ్గర నుంచి పన్నును వసూలు చేయాలని ఆనాటి రాజులు వీరికి ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కరోనా కేసుల విషయంలో ఆరోగ్యశాఖ దాస్తుందని ఆరోపణ

### ప్రతి నియోజకవర్గ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్





బద్వేలు, జూలై 17, ప్రభాతవార్త

కరోనా కేసుల నమోదు విషయంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్దేశపూర్వకంగా సమాచారం దాచిపెడుతుందని సీపీఐ ఎం ఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం నివారణ చర్యల్లో నిరక్ష ్యం వహిస్తోందని ఆరోపిం చారు. శుక్రవారం భగత్ సింగ్ నగర్ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు కె.జకరయ్య అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు వారాలుగా రాష్ట్రవ్యాప్తంగా కరోనా కేసులు నమోదవుతున్నాయని, కడప జిల్లాలో ఇప్పటివరకు 8 కేసులు నమోదు కాగా 3 మంది మరణించారని తెలిపారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. కేసుల వివరాలు బయటకు రాకుండా ఆరోగ్యశాఖ వ్యవహరిస్తుండడంతో భయాందోళనలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారిని సంప్రదించగా కరోనా కేసులు నమోదైన మాట వాస్తవమేనని, వేరియంట్ పరీక్ష కోసం శాంపిల్స్‌ను పూణే వైరాలజీ ల్యాబ్‌కు పంపినట్లు, రిమ్స్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని చంద్రశేఖర్ చెప్పారు. ఈ సమావేశంలో కె.బాబు, విజయరావు, రామరాజు, సంజీవ్, జయరామరాజు, గంటా మహబూబ్ బాషా, తప్పెట సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## 2024 ఏడాదిలోని పెండింగ్లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలి



లక్కిరెడ్డిపల్లి : జూలై 17 ప్రభాత వార్త

2024 ఏడాదిలో లక్కిరెడ్డిపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 22 మంది అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లకు సంబంధించిన మూడు నుంచి ఆరు నెలల వరకు నిలుపుదల చేసిన తమ జీతాలను వెంటనే జిల్లా అధికారులు చొరవ తీసుకొని చెల్లించాలని శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సందర్భంగా వారు తమ జీతాలను వెంటనే చెల్లించాలని కార్యాలయం లో ఉన్న క్లర్క్ గణేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు.. సందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు సుకుమారి మాట్లాడుతూ తమకు నిలుపుదల చేసిన జీతాలను జిల్లా అధికారులు తక్షణమే చెల్లించాలని లేనిపక్షంలో జిల్లా కార్యాలయం ఎదుట ధర్నాకు కూర్చుంటామని హెచ్చరించారు. గత రెండేళ్లుగా జీతాలు చెల్లించాలంటూ లక్కిరెడ్డిపల్లె ఐసిడిఎస్ కార్యాలయం చుట్టూ ప్రదక్షి ణ చేస్తున్నామని ఎవరు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు

## ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### ఆర్ఎంపి రమేష్ బాబు



పీలేరు , జూలై 17 ప్రభాతవార్త:

ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్ఎం పి. రమేష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ మరుగుదొడ్లను, డ్రైనేజీ సమస్యను, గ్యారేజ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకులకు సౌకర్యాల కల్పనలో రాష్ట్ర వ్యాప్తంగా కింది నుంచి 20 స్థానాల్లోపు పీలేరు డిపో ఉందని, సౌకర్యాలు మెరుగుపరచడానికి ఇక్కడ ఉన్న సమస్యపై అధికారులతో చర్చించి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. నూతన మరుగు దొడ్లను పరిశీలించి విద్యుత్ లేని సమయంలో కూడా నీటి సమస్యలేకుండా అదనంగా మోటారు, ట్యాంకు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎం ఎస్ఎండీ రోషన్, ఎంఎఫ్ ఫణిభూషన్ నాయక్ , సీఐ ధనుంజయలు, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం

### బాధిత మహిళకు వైద్యసాయం చేసిన ఎంపీ

### అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారం

### దాడిలో గాయపడిన యురేనియం ఉద్యోగిని పరామర్శించిన ఎంపి



పులివెందుల, జూలై 17 ప్రభాత వార్త :

పులివెందుల పట్టణంలోని తన స్వగృహం వద్ద శుక్రవా రం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో వెంటనే చరవాణి ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి ఎప్పటికీ కొనసాగుతుందని, ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రాజధాని, పోలవరం పేరుతో కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన పెద్ద రంగాపురానికి చెందిన ఓ మహిళ ప్రమాదవశాత్తు కిందపడి నడుముకు తీవ్ర గాయాలపాలై చికిత్సకు సుమారు రూ.3 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు సూచించిన విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకురాగా, ఆమెను నెల్లూరుకు తరలించి మెరుగైన వైద్యం అందించేలా వెంటనే ఏర్పాట్లు చేశారు. అనంతరం, ఇటీవల జరిగిన దాడిలో గాయపడి కోలుకుంటున్న యురేనియం ఉద్యోగి, చిన్న రంగాపురం గ్రామానికి చెందిన బొగ్గుల సుగునాథ రెడ్డిని ఎంపీ అవినాష్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డుకు ఐదుగురు పేద విద్యార్థుల ఎంపిక



ముద్దనూరు, జూలై 17, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని ప్రభుత్వం మరియు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ఐదుగురు పేద విద్యార్థులు ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 20వ తేదీన కడపలో నిర్వహించే అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రివర్యులు, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డులు అందజేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓలు) శశికల, నాగేశ్వర్ నాయక్ తెలిపారు. అవార్డుకు ఎంపికైన విద్యార్థుల్లో కె. రవి చరణ్ (579 మార్కులు), బి. వెంకట తేజేష్ (577), ఏ. వెంకట కిరణ్ (565), ఎస్. సుహానా (562), జి. అఖిల్ రాజ్ కుమార్ (546) ఉన్నారు. వీరికి అవార్డుతో పాటు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నట్లు ఎంఈఓలు వెల్లడించారు. విద్యార్థుల ప్రతిభకు గుర్తింపుగా లభించిన ఈ గౌరవం మండలానికి గర్వకారణమని, వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆకాంక్షి ం చారు.

## ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జోహార్ ని కలిసిన జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు



పీలేరు, జూలై 17, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కడప జిల్లా పర్యటనలో ఉన్న విషయం తెలుసుకొని కేవీ పల్లి మండలం గ్యారంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూలు విషయమై ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడి వారి ద్వారా ఎస్సీ కమిషన్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది. కె.వి పల్లి మండలం గ్యారంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి పదవ తరగతి విద్యార్థులకు టీసీలు ఇచ్చే సమయంలో డొనేషన్ పేరుతో విద్యార్థుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న విషయంపై, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సదాశివ నాయుడు వైస్ చైర్మన్ సుభహాన్‌ల చేత నాగార్జున అనే దళిత విద్యార్థి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సోషల్ మీడియాలో పోస్ట్ చేసి విద్యార్థిని అవమానించిన విషయంపై ఉన్నత అధికారులచే విచారణ జరిపి విద్యార్థికి న్యాయం చేయాలని ఎస్సీ కమిషనుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి సమగ్ర విచారణ జరిపించి విద్యార్థికి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్య క్రమం అన్నమయ్య జిల్లా ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గండికోట వెంకటేష్, కో ఇన్చార్జ్ ముల్లంగి రెడ్డప్ప, ఎం ఆర్ పి ఎస్ కలకడ మండల అధ్యక్షులు వంగిమల్ల హరినాధ, బాధిత విద్యార్థి నాగార్జున, విద్యార్థి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ కు వచ్చే బాధితుల పట్ల బాధ్యతతో మెలగండి

### డీఐజీ కోయా ప్రవీణ్



వాల్మీకిపురం, జూలై 17 ప్రభాతవార్త :

నిత్యం పలు సమస్యలపై పోలీసు స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల పోలీసులు బాధ్యతతో వ్యవహరించడంతో పాటు వారికి న్యాయం జరిగేలా చూడాలని డీఐజీ కోయా ప్రవీణ్ అన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్, పోలీసు స్టేషన్లను ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఫ్రెండ్లీపోలీసును అమలు చేయాలని, ప్రజలతో మంచి సంబంధాలు పెంచుకుని వ్యవస్థపై నమ్మకం కలిగించాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సర్కిల్పరిధిలో పోలీసుల నిఘా పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మండలకేంద్రాలతో పాటు పట్టణప్రాంతాల్లో రాత్రిపూట గస్తీని ముమ్మరం చేయాలన్నారు. ప్రజలకు రక్షణ కల్పించేవిషయంలో పోలీసులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ రాఘవరెడ్డి ఎస్సై తిప్పేస్వామి, స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డుకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక



పెద్దమండెం జూలై 17 ప్రభాతవార్త

మండలంలోని కలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జస్వంత్ రెడ్డి 576 రేవతి 513 మార్కులతో ఉన్న స్థానంలో నిలిచారు వీరికి ప్రభుత్వం తరఫున షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పాఠశాల హెచ్ఎం మీనా నాగలక్ష్మి తెలిపారు. వీరికి మోడల్ ప్రశంసాపత్రంతోపాటు 20 వేల రూపాయల నగదు బహుమతులను అందజేస్తారు విద్యార్థుల్లో ప్రతిభ ను గుర్తించడానికి విద్యా ప్రమాణా లను మెరుగుపరచడానికి ఈ ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు షైండింగ్ స్టార్ అవార్డులను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు.

## కళాశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



బద్వేలు అర్బన్, జూలై 17, ప్రభాతవార్త:

సమగ్ర శిక్ష పథకం ద్వారా బద్వేలు ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న జూనియర్ కాలేజీ విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్ పంపిణీ చేయడం జరిగిందనీ, ఇంతకుముందు వీరికి పాఠ్య పుస్తకాలను కూడా అందించడం జరిగింది. దీంతో హై స్కూల్ ప్లస్‌లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఉచిత భోజన వసతి వంటి సౌకర్యాలన్నీ కల్పించినట్లయిందన ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సారూప్య దుస్తులు మరియు బ్యాగ్ కూడా పంపిణీ చేస్తే విద్యార్థులకు యూనిఫామ్ సౌకర్యం కూడా లభించే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఎద్దు జకరయ్య, లెక్చరర్ తుడిమెల్ల వెంకటసుబ్బయ్య, ఆంగ్ల ఉపాధ్యాయులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఇంట ర్యాంకుల పంట

పీలేరు జూలై 17 ప్రభాతవార్త:

ఒక మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించిన దీ. పరమేశ్వర రాజు గతంలో కల్లూరు, బాకారపేట హైస్కూల్ లో మాథ్స్ టీచర్ గా పనిచేసి ఇటీవల కలకడ పాపిరెడ్డిగారిపల్లి హైస్కూల్ కి ప్రధాన ఉపాధ్యాయులు గా పదోన్నతి పొందారు వారి శ్రీమతి జు. విజయలక్ష్మి రొంపిచర్ల హైస్కూల్ నందు సోషల్ టీచర్ గా పని చేస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయ వృత్తిలో వుంటూ ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తు కు కారణం అయ్యారు. కాగా శుక్రవారం విడుదల అయిన వినినిగి పరీక్ష ఫలితాల్లో దీ. పరమేశ్వర రాజు జు. విజయలక్ష్మిల కుమారుడు దీ. రోహిత్ 720 మార్కులకు గాను 680 సాధించి ఆల్ ఇండియా ర్యాంక్ 316 సాధించి తల్లి తండ్రుల పేరు నిలబెట్టారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ సాధించానని తెలిపారు.



# జగన్ 2.0 సూపర్‌యాప్ కార్యకర్తలకు అండ

### వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్

**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :**

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన జగన్ 2.0 సూపర్ యాప్ కార్యకర్తలకు కొండంత అండగా ఉంటుందని వైకాపా నియోజకవర్గ ఇన్ చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వైకాపా కార్యాలయంలో జగన్ 2.0 సూపర్‌యాప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ 2.0 సూపర్‌యాప్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేసే ఆధునిక డిజిటల్ వేదికగా నిలుస్తుందన్నారు. పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వం, ప్రజాసమస్యల నమోదు, ప్రభుత్వ వైఫల్యాలపై సమాచారం, పార్టీ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని వేగంగా అందించేందుకు ఈయాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైకాపాకు చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్తల తమ మొబైల్స్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని నమోదు చేసుకోవాలన్నారు. పార్టీని డిజిటల్‌గా మరింత బలోపేతం చేయడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మెన్ మనూజా, మాజీ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి విఎస్.రెడ్డి, నాయకులు బయ్యారెడ్డి, వెలుగు చంద్ర, గుండ్లూరు రఫి, ఆవుల మల్లికార్జున, నాగార్జుననాయుడు, ఈశ్వర్‌నాయక్, చిప్పిలి మల్లికార్జునరెడ్డి, బొమ్మిశెట్టి మధు, శరాదారెడ్డి, వినూతాబాయి, నాగమణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



యాప్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

# నిరుపేద దళిత,ఎస్సీ, ఎస్టీ బీ.సీ.వర్గాలకు భూ పంపిణీ చేయాలి



**కలసపాడు జూలై 17 ప్రభాతవార్త:**

మండలంలోని తెల్లపాడు పంచాయతీలో ఎస్సీ, ఎస్టీ,బీసీలకు ఇంతవరకు ఒక ఎకరా పొలం లేని వ్యక్తులు ఎంతో మంది వ్యక్తులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని టిడిపి మండల నాయకులు రాజుపాలెం మాజీ సర్పంచ్ పామూరి బాలిరెడ్డి, తెల్లపాడుగ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ దామిరెడ్డి ఈశ్వర రెడ్డి, తెల్లపాడు గ్రామ పంచాయతీ టీడీపీ యువ నాయకుడు బిజివేముల రోశిరెడ్డిలు బద్వేలు నియోజక వర్గ పెద్దలు బద్వేలు మాజీ శాసనసభ్యులు కొనిరెడ్డి విజయమ్మ దృష్టికి తీసుకురావడం జరిగింది. అనంతరం న్యాయం కోసం తాసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

# గౌరవప్రదమైన అంతిమ సంస్కారమే మా లక్ష్యం

**ప్రొద్దుటూరు అర్బన్ జూలై 17 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్ ను సంప్రదించగా వారు స్పందించి శుక్రవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్,నరేంద్ర కుమార్,అశోక్ కుమార్, సతీష్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు. చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు మాట్లాడుతూ సమాజంలో ఎవరూ లేని వారికి కూడా గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు జరగాలని ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టామని వారు తెలిపారు.మేఐహెల్ప్యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్ధులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే తమ సంస్థను సంప్రదించాలన్నారు.

# ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**వేంపల్లి జూలై 17 ప్రభాతవార్త**



విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాల బకాయిలు, డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ పథకం కింద బకాయిలను విడుదల చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తులసి రెడ్డి వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలన్న ఉన్నత ఆశయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008,09 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ, ఇంజనీరింగ్,ఫార్మసీ,పీజీ కోర్సులు చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాలను ప్రారంభించింది అన్నారు. ఈ పథకాల ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు పొంది, ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తున్నారు.అటువంటి ఉదాత్తమమైన పథకాన్ని చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాల పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన వడ్డీ బకాయిలను విడుదల చేయాలని తులసి రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లెం విజయ్ భాస్కర్,జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# 19న వెలుగుస్కూల్‌లో మూర్ఛవ్యాధిపై శిబిరం

**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :**

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ఈనెల 19న ఆదివారం మూర్ఛవ్యాధిపై శిబిరం నిర్వహించనున్నట్లు వెలుగు స్కూల్ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిబిఆర్ ఫౌండేషన్ నుంచి వెలుగుసంస్థలో డాక్టర్ గోపాలం శివనారాయణ ద్వారా ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి వెలుగుస్కూల్‌లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.వైద్యశిబిరానికి వచ్చే రోగులు పాత రిపోర్ట్స్, వాడుతున్న మందుల అట్టలు తీసుకొని రావాలన్నారు. వివరాలకు 9440585285 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# వైఎస్ఆర్సిపి జోనల్ పబ్లిసిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెప్పలి వినోద్ కుమార్

**కడప కార్పొరేషన్ జూలై 17 ప్రభాతవార్త:**

రాష్ట్ర వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల వైఎస్ఆర్సిపి జోనల్ పబ్లిసిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా చెప్పలి వినోద్ కుమార్ ను నియమించారు. శుక్రవారం కడపలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని వైయస్సార్సీపి జోనల్ పబ్లిసిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెప్పలీ వినోద్ కుమార్ గజమాల, కండువా వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి జోనల్ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా నన్ను నియమించినందుకు మాజీ సీఎం, వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి జీవితాంతం రుణపడి ఉంటానని వినోద్ కుమార్ పేర్కొన్నారు. వైయస్ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, కడప నియోజవర్గ ఇన్చార్జి మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష, మాజీ మేయర్ సురేష్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు సినిమాల వెంకటేశ్వర్లు, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, షఫీ, నరసింహ, కుమార్ జాన్సన్ పాల్గొన్నారు.

# ప్రజావేదిక కూల్చివేతనే జగన్ విధ్వంసక పాలనకు నిదర్శనం

**ప్రొద్దుటూరు జూలై 17 ప్రభాతవార్త**

రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టిన వెంటనే ప్రజావేదిక కూల్చివేసి విధ్వంసక పాలన ప్రారంభించిందని టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక ఆర్అండ్‌బి భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేష్ కడప జిల్లా పర్యటన విజయవంతం కావడం పట్ల మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి జీర్ణించుకోలేక అసంతృప్తితో విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధానంగా మంత్రి లోకేష్ పర్యటన జమ్మలమడుగులో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు భూమిపూజ చేసేందుకు వచ్చారని అనంతరం కడపకు వెళ్లే మార్గంలో ప్రొద్దుటూరులో నిర్వహించిన కార్యకర్తల సమావేశం కేవలం పార్టీ కార్యక్రమమేనని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా జరిగిందని విమర్శించారు. టీడీపీ హయాంలో కొప్పర్తి, ఓర్వకల్లు వంటి పారిశ్రామిక ప్రాంతాలకు పునాదులు పడ్డాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్, గూగుల్, రిలయన్స్, ఆయిల్ కార్పొరేషన్, వైమానిక దళ కంపెనీలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తోందని వివరించారు. జగన్ పాలనలో రాయలసీమ రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. లోకేష్ పర్యటన తనకు ప్రయోజనం చేకూరలేదని రాచమల్లు భావిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. ప్రొద్దుటూరు అభివృద్ధిపై గత, ప్రస్తుత పాలనలో జరిగిన పనులపై బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. నిలిచిపోయిన మార్కెట్, ఆర్టీపీపీ బ్రిడ్జి, ఎస్సీఎన్ఆర్ కళాశాల, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తోందన్నారు. ఏపీకి హైదరాబాద్ తరహా అభివృద్ధి చెందిన రాజధాని అవసరమని, అమరావతి నిర్మాణానికి అడ్డంకులు సృష్టించిన వారిని ప్రజలు తిరస్కరించారని కొండారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి ముక్తియార్, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జబీవుల్లా, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# రూ.39 లక్షలతో జలధార కింద చెరువు పనులు

### డిఈ దయా రమణప్రసాద్

**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :**



మైనర్ ఇరిగేషన్ శాఖకు సంబంధించి మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలో రూ.39లక్షలతో జలధార కింద చెరువు పనులు చేపడుతున్నట్లు డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ దయా రమణప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్ఈ వెంకటరామయ్య ప్రతిపాదనలతో కలెక్టర్ జలధార కింద చెరువు పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. మదనపల్లె మండలంలోని ఎగువ కాశీరావుపేట వద్ద చెక్‌డ్యాం నిర్మాణానికి, నిమ్మనపల్లె వద్ద చెక్‌డ్యాం పనులకు, రామసముద్రం మండలంలోని అగ్రహారం చెరువు పనులకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. పనులన్నీ నాణ్యతగా చేసేలా క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలోనే చెరువుల అభివృద్ధికి వివిధ పథకాల కింద రూ.2 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. చెరువుల అభివృద్ధికి ప్రభుత్వ సూచనల ప్రకారం పటిష్ట చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చీకలబైలు వద్ద ఉన్న కదిరమ్మ చెరువును పరిశీలించనున్నట్లు తెలిపారు. జలహారతి కింది మరిన్ని చెరువు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

# డియంహెచ్‌ఓను కలిసిన ఏపీ ఎన్జీవోస్




**కడప కార్పొరేషన్ జూలై 17 ప్రభాతవార్త:**

కడప జిల్లా నూతన వైద్య ఆరోగ్య శాఖాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.యుగంధర్ ని కడప జిల్లా ఏపీ ఎన్జీజీవోస్ అధ్యక్షులు బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం కడప కార్యాలయంలో కలసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ నేతృత్వంలో జిల్లాలో వైద్య ఆరోగ్య సేవలు ప్రజలకు మరింత మెరుగ్గా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా, ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి, అధికారులకు ఎన్జీవోస్ సంఘం తరపున ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ జిల్లా నాయకుల జిల్లా ఉపాధ్యకులు బాలపుల్లయ్య, సిద్దయ్య జిల్లా జాయింట్ సెక్రటరీ పద్మనాభరావు, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు వెంకటరెడ్డి పులివెందుల తాలూకా సహ అధ్యక్షులు సుకుమార్, అసోసియేషన్ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# వైసిపి టిడిపిల అంకెల గారడి తప్ప ప్రొద్దుటూరు అభివృద్ధి శూన్యం

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా

**ప్రొద్దుటూరు రూరల్, జూలై 17, ప్రభాతవార్త**



నియోజకవర్గంలో గత వైసిపి ప్రస్తుత టిడిపి పాలనలో అంకెల గారడి తప్ప ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఎస్ ఇర్ఫాన్ భాష పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో రాజకీయ ఆరోపణలు, ఘర్షణలకు స్వస్తి చెప్పి పట్టణ అభివృద్ధి, యువతకు ఉద్యోగాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార, ప్రతిపక్ష పార్టీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత నాలుగు దశాబ్దాలుగా పట్టణానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకోవడం తప్ప ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టలేదన్నారు. మార్కెట్ నిర్మాణం, టెండర్ల వ్యవహారం, బస్‌స్టాండ్ ప్రారంభం, పరిశ్రమల ఏర్పాటు, నిరుద్యోగ భృతి వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కాలువలు, రోడ్లు నిర్మించడమే అభివృద్ధి కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రొద్దుటూరులో గత కొన్నేళ్లుగా జరిగిన రాజకీయ ఘర్షణలు, దాడులు, హత్యలు, పలు వివాదాస్పద ఘటనలపై బాధ్యులు సమాధానం చెప్పాలని ఇర్ఫాన్ బాషా అన్నారు. నందం సుబ్బయ్య హత్య కేసులో ప్రత్యేక విచారణ ఎందుకు ముందుకు సాగలేదని ప్రశ్నిస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయని విమర్శించారు. మార్కెట్‌లో నిర్మించిన షెడ్ల చట్టబద్ధతపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి వివరణ ఇవ్వాలని కోరిన ఆయన, ప్రజల తీర్పుపై విశ్వాసముంటే రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఇకపై కూటమి ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తరపున ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

# మానవతకు రూ.50 వేల విరాళం

### శాశ్వత సభ్యత్వం స్వీకరించిన ఇద్దరు దాతలు

**పులివెందుల, జూలై 17, ప్రభాతవార్త :**

పులివెందులలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు ఇద్దరు దాతలు మొత్తం రూ.50 వేల విరాళం అందజేసి సంస్థ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించారు. దాతల సేవాభావాన్ని సంస్థ ప్రతినిధులు అభినందిస్తూ, వారి సహకారం సేవా కార్యక్రమాల విస్తరణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. తొండూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)గా సేవలందించి దివంగతులైన వెన్నపూస శ్రీనివాసరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ, కుటుంబ సభ్యులు డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ వసుంధరలు రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. బలపనూరుకు చెందిన దివంగత ఎలుగోటి శివనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు జగదీశ్వర రెడ్డి, సువర్ణలత దంపతులు మరో రూ.25 వేల విరాళాన్ని సంస్థకు అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పెన్షనర్ల భవనంలో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంస్థ చైర్మన్ డి.వి. కొండారెడ్డి, నూతన అధ్యక్షుడు చవ్వా కృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దాతల సేవానిరతి, దాతృత్వాన్ని కొనియాడారు. 2026-27 సంవత్సరానికి సేవా కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని తీర్మానించారు. సమావేశంలో పులివెందుల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏ.వి. గోపాల్ రెడ్డి, సంస్థ కోశాధికారి హరిశ్చంద్రారెడ్డి, డైరెక్టర్లు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# ఆర్టీసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త:**


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆర్టీసి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికి ఆర్టీసి యాజమాన్యం ద్వారానే వేతనాలు చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు మెటర్నటి సెలువులు ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్టీసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై వన్, టూ డిపో మేనేజర్లకు ఏఐటియుసి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8వేల మంది కార్మికుల ఆర్టీసి వివిధ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారన్నారు. ఆర్టీసిలో థర్డ్‌పార్టీ కాంట్రాక్టు పద్దతిని రద్దు చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికి ఆర్టీసి గుర్తింపు కార్డులు మంజూరు చేసి విధులకు వచ్చే వారికి ఆర్టీసి బస్సులోఉచిత సౌకర్యం కల్పించాలన్నారు. వారాంతపు సెలువుతో పాటు జాతీయ సెలవులు, రాష్ట్ర సెలువుల సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణప్ప, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కార వేదిక




**సుండుపల్లె, జూలై 17,ప్రభాతవార్త :**

రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలాల ప్రజల సౌకర్యార్థం అసెంబ్లీ ఇంచార్జి జగన్ మోహన్ రాజు 17 వ తేది శుక్రవారం రాజంపేటలోని తోట కన్వెన్షన్ నందు రెవిన్యూ భూసమస్యల ప్రత్యేక పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లాజాయింట్ కలెక్టర్ నిదియా మీనా ఐఎఎస్,రాజంపేట సబ్ కలెక్టర్ భావన కలసి ప్రారంభించినారు.ఈ సందర్భంగా సుండుపల్లె మండలం నుండి భూసమస్యలకు సంబంధించి 34 అర్జీలు వచ్చాయని వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తాసిల్దార్ వేణుగోపాల్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, ఆర్ఐలు, విఆర్ఎలు గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

# కొత్తపల్లి గ్రామపంచాయతీ మున్సిపాలిటీలో విలీనంపై గ్రామసభ

**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 17 ప్రభాతవార్త**

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామపంచాయతీని ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రతిపాదనపై గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో విలీనం వల్ల కలిగే ప్రయోజనాలు, భవిష్యత్ పరిణామాలపై గ్రామస్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కొత్తపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, డివిజనల్ అభివృద్ధి అధికారి ఎస్. మంజుల వాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీఎల్‌పిఓ నూర్జహాన్, ఈవోపీఆర్డీ రామాంజనేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, సినీహబ్ అధినేత రాజేశ్వర్ రెడ్డి, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మండలాధ్యక్షురాలు మల్లెల ఝాన్సీ మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామపంచాయతీని పంచాయతీగానే కొనసాగించాలని కోరారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే పన్నుల భారం పెరిగే అవకాశం ఉందని, ఉపాధి హామీ పనులు ప్రభావితమయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. డ్వాక్రా సంఘాలు మెప్మా పరిధిలోకి మారడం, కొత్త విధానాల అమలులో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గ్రామసభలో ప్రజల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని కోరారు. సినీహబ్ అధినేత రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిపాలన సౌలభ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అన్నారు. విలీనం విషయంలో ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం ఉండాలని సూచించారు. కాగా కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని ప్రజలు పాల్గొని వారి అభిప్రాయం వ్యక్తం చేశారు.


సభలో మాట్లాడుతున్న అధికారులు

# మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా


ధర్నా చేస్తున్న కార్మికులు

**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :**

గత ఆరు నెలలుగా వేతనాలు చెల్లించలేదంటూ పారిశుధ్య కార్మికులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటి పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉదయం 5గంటలకే పారిశుధ్య పనుల్లోకి వస్తున్నామని, వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ కష్టంగా ఉందన్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్నా గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో మరింత భారంగా ఉందన్నారు. వేతనాలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకొన్నా ప్రయోజనం లేకపోయిందన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే స్పందించి కమిషనర్‌కు విషయం తెలియజేయడంతో త్వరలోనే కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ధర్నాను విరమించారు.

# 21 నుంచి సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

**నందలూరు, జూలై 17 ప్రభాతవార్త :**

వైఎస్సార్ కడప జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పదకొండు రోజుల పాటు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.ఈ నెల 21న తిరుమంజనం, రాత్రి అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 22న ధ్వజారోహణం, యాలి వాహనం, 23న పల్లకి సేవ, హంస వాహనం, 24న పల్లకి సేవ, సింహవాహనం, 25న పల్లకి సేవ, హనుమంత వాహనం, 26న శేషవాహనం, గరుడవాహనం, 27న సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు నిర్వహిస్తారు. 28న కల్యాణోత్సవం, గజవాహనం, 29న రథోత్సవం, అశ్వ వాహనం, 30న చక్రస్నానం, ధ్వజావరోహణం, 31న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో వారికి తాగునీరు, క్యూలైన్లు, పారిశుద్ధం, వైద్యసేవలు తదితర సకల సౌకర్యాలు కల్పించేందుకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# జ్యోతి కళానిధికి నీట్ జనరల్ EWS విభాగంలో 8350 ర్యాంక్

**సిద్దవటం,జూలై 17: ప్రభాతవార్త**



సిద్దవటం మండలం చెందిన శ్రీ భారతి హై స్కూల్ పూర్వపు విద్యార్థిని జ్యోతి కళానిధి నీట్-2026లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జనరల్ నిజూళీ విభాగంలో ఆల్ ఇండియా ర్యాంక్ 8350 సాధించడం పాఠశాలకు గర్వకారణమని శ్రీ భారతి హై స్కూల్ కరస్పాండెంట్ డా. ముక్కర వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. జ్యోతి కళానిధి తల్లిదండ్రులు జ్యోతి నరసింహారెడ్డి మరియు జ్యోతి శారద తమ కుమార్తె సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో చదువులో రాణిస్తూ ఈ విజయాన్ని అందుకుందని వారు తెలిపారు.ఈ సందర్భంగా డా. ముక్కర వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ, జ్యోతి కళానిధి సాధించిన ఈ విజయం శ్రీ భారతి హై స్కూల్‌కు ఎంతో గర్వకారణం. ఆమె భవిష్యత్తులో వైద్య విద్యను విజయవంతంగా పూర్తిచేసి సమాజానికి సేవ చేసే ఆదర్శ వైద్యురాలిగా ఎదగాలని కోరారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ,విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు జ్యోతి కళానిధికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు.

# పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

### ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంతరాయం.

**మైదుకూరు, జూలై 18, ప్రభాతవార్త :**

విద్యుత్ లైన్ల కింద నిర్వహించనున్న మరమ్మతు పనుల కారణంగా శనివారం ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పలు 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మైదుకూరు విద్యుత్ సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్న ప్రాంతాలు మైదుకూరు మండలం 11 కేవీ కడప రోడ్డు ఫీడర్ మైదుకూరు సబ్ స్టేషన్ 11 కేవీ కృష్ణాగోపాలపురం ఫీడర్ నంద్యాలంపేట, వనిపెంట సెక్షన్ 11 కేవీ జంగంరెడ్డిపల్లి ఫీడర్ వనిపెంట,ఖాజీపేట మండలం 11 కేవీ సిద్ధాంతిపురం, 11 కేవీ రావులకొలను ఫీడర్లు ఖాజీపేట సబ్ స్టేషన్, దువ్వూరు మండలం 11 కేవీ మీర్జాఖాంపల్లి, 11 కేవీ రామాపురం ఫీడర్లు చింతకుంట సబ్ స్టేషన్,చాపాడు మండలం 11 కేవీ చాపాడు పట్టణ ఫీడర్ చాపాడు సబ్ స్టేషన్,11 కేవీ వెదురూరు ఫీడర్ వెదురూరు సబ్ స్టేషన్లలో అధికారుల విజ్ఞప్తి చేస్తూ విద్యుత్ లైన్ మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేసేందుకు సంబంధిత ప్రాంతాల ప్రజలు, రైతులు సహకరించాలని సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.పనులు పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

# అసిస్టెంట్ ఇంజనీర్ గా బాధ్యతలు చేపట్టిన ఎం. చిన్నయ

**కలసపాడు, జూలై 17 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన కలసపాడు లోని విద్యుత్ సబ్ స్టేషన్ నందు గతంలో పనిచేస్తున్న బి కోడూరు మండలం ఎం. చిన్నయ శుక్రవారం కలసపాడు విద్యుత్ సబ్స్టేషన్ నందు అసిస్టెంట్ ఇంజనీర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యల పైన విచారించి రైతులకు ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సరఫరా చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మండలంలోని రైతులు వ్యవసాయదారులు విద్యుత్ కు సంబంధించిన సమస్యలుఏవైనా ఉంటే ఏ సమయంలో మా దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకొని రైతులకు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని మండలం లోని ప్రతి ఒక్కరు కరెంట్ బిల్లులు డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించి విద్యుత్ సమస్త కి సహకరించగలరని కోరారు.

# సాంకేతిక విజ్ఞానంను పెంపొందించుకోవాలి



అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

**సిలిక్వాన్ టెక్నాలజీస్ వ్యవస్థాపకులు అష్రఫ్అలి**

**మదనపల్లె, జులై 17 ప్రభాతవార్త :**

ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక విజ్ఞానంతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సిలిక్వాన్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.అష్రఫ్అలి తెలిపారు. పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వీఎల్ఎస్ఐ టెస్టింగ్–ఫిజికల్ డిజైన్ అనే అంశంపై సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సెమీ కండక్టర్ రంగంలో రోజురోజుకు విస్తరిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే విద్యార్థులు కళాశాల స్థాయి నుంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. సమర్థవంతమైన భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, పరిశోధనాత్మక ప్రాజెక్టులపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరం అన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ ఇటువంటి సాంకేతిక సదస్సులు విద్యార్థుల్లో పరిశ్రమ అవసరాలపై అవగాహన పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి కెవి.వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాముడు విద్యార్థులను అభినందించి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సర్ ఓటర్ల జాబితా పై సమీక్ష



**దువ్వూరు, జులై 17, ప్రభాతవార్త:**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్ ఓటర్ల జాబితాలో జరుగుతున్న సవరణలపై స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో తహసిల్దార్ సునీత మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సరి చూసేందుకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు పెంచిందని తెలిపారు. ఈ గడువు లోపల ఎవరైనా ఓటర్ల ఫారములు అందజేయకపోతే వాటిని ఎక్కడ ఉన్నారో కనుగొని, తీసుకొని వాటిని పూర్తి చేయాలన్నారు. అలాగే 2002 జాబితాకు సంబంధించి మ్యాపింగ్ కానీ ఓటర్ల జాబితాను పరిశీలించి అది మ్యాపింగ్ అయ్యే విధంగా చూడాలన్నారు. ఎవరైనా ఓటర్ల జాబితాలో చనిపోయిన వారు ఉంటే వారి మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకొని వాటిని తొలగించే ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే వలస వెళ్లినవారు, ఇతర ప్రాంతాలలో ఉన్న వారి ఓట్లను గుర్తించి ఒకే చోట ఓటు ఉండే విధంగా చూడవలసిన బాధ్యత బిఎల్ఓ లపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాలు అన్నింటిని ఈనెల 24వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సుమారు 90 శాతం మించి చేశారని మిగతా 10 శాతాన్ని కూడా పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో బిఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యనారాయణ రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు



**బద్వేలు, జులై 17, ప్రభాతవార్త**

బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నూతన ఇన్‌చార్జ్‌గా నియమితులైన మంచూరి సూర్యనారాయణ రెడ్డిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బద్వేల్ మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ నాగేంద్ర ఆధ్వర్యంలో వారు సూర్యనారాయణ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ, సూర్యనారాయణ రెడ్డి తన నూతన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి, కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా బద్వేల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకుడు బొమ్మనా సుబ్బారాయుడు, జనరల్ సెక్రటరీ ఉట్టి శ్రీనివాసులు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు అశోక్ రెడ్డి, టౌన్ ఇన్‌చార్జ్ పల్లంశెట్టి పండరి, మండల అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి, నాగేంద్ర, రవి, నారాయణ రెడ్డి, వెంకటసుబ్బయ్య రాయల్, సుధాకర్ రెడ్డి, మల్లెంకొండ రాజు, దుల్ల శ్రీనివాస్ రెడ్డి, కె.చెన్నయ్య, టెంకాయల గురయ్య, శివారెడ్డి, తమ్మిశెట్టి రమణ, జయరాం, ఉండేలా శ్రీనివాస్ రెడ్డి తదితరులతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పీలేరు పంచాయతీకి అరుదైన గౌరవం

**పారదర్శక పాలనకు రాష్ట్రంలో ఐఎస్ఓ గుర్తింపు.**

**పీలేరు జూలై 17 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అత్యుత్తమ పాలన, పారదర్శకత, నాణ్యమైన పౌర సేవలను అందిస్తున్న 23 గ్రామ పంచాయతీలకు అంతర్జాతీయ ప్రమాణాల ఐఎస్ఓ గుర్తింపు లభించింది. అందులో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీకి కూడా ఈ అరుదైన గౌరవం దక్కింది. ఐ ఎస్ ఓ 90012015 నాణ్యత నిర్వహణ వ్యవస్థ సర్టిఫికెట్‌ను తాడేపల్లి గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.వి కృష్ణ తేజ పీలేరు పంచాయతీ డెవలప్మెంట్ అధికారి జ్ఞాన శేఖర్ కు అందజేశారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా తీసుకున్న నిర్ణయాలు, అధికారులకు ఇచ్చిన స్పష్టమైన దిశానిర్దేశం కారణంగానే అన్నమయ్య జిల్లాలో మొదటి గ్రామ పంచాయతీగా పీలేరు పంచాయతీ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఐఎస్ఓ గుర్తింపుతో పీలేరు పంచాయతీ పాలనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లయిందని పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.

# వాసవి మాతకు గోరింటాకు అర్చన పూజలు

**వేంపల్లి జూలై 17 ప్రభాతవార్త**



ఆషాఢ మాసం పురస్కరించుకుని వేంపల్లెలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటం శెట్టి చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో మూలవిరాట్ వాసవి మాతకు పంచామృతాభిషేకం, శ్రీపత్ర (గోరింటాకు) అర్చన,నివేదన, మహామంగళ హారతి, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తి అమ్మవారిని పీఠంపై కొలువుదీర్చి గోరింటాకుతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సభ్యులు అమ్మవారి పీఠాన్ని భుజాలపై పెట్టుకొని జై వాసవి మాత జై జై వాసవి మాత అంటూ గర్భగుడి చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. మహిళలు వాసవి మాతకు గోరింటాకుతో లలితా సహస్రనామ పారాయణం, అష్టోత్తరం నిర్వహించారు.రోలును పసుపు కుంకుమలతో అలంకరించి పాటలు పాడుతూ గోరింటాకును దంచారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు, నిర్వాహకులు మిట్టా ప్రవీణ్, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# షైనింగ్ స్టార్ అవార్డుకు శ్రీ నలంద విద్యార్థి ఎంపిక

**సిద్ధవటం జూలై 17 ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా నిర్వహించే షైనింగ్ స్టార్ అవార్డుకు శ్రీ నలంద పాఠశాల విద్యార్థి ఎంపిక అయ్యారని పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్ వెంకటేశు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది పదవతరగతిలో కోటపాటి గోపి సునంద 565 మార్కులు సాధించి,ఈ అవార్డును కైవసం చేసుకున్నారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది మా పాఠశాల నుంచి షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ఎంపిక కావడం చాలా సంతోషమన్నారు. ఈ విజయానికి మా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని వారన్నారు. ఈ కార్యక్రమంలో అవార్డుకు ఎంపికైన విద్యార్థి కోటపాటి గోపి సునంద ను ప్రత్యేకంగా పాఠశాల కరస్పాండెంట్ మరియు అధ్యాపకులు అభినందించారు.

# వారాహి నవరాత్రులు ప్రారంభం

**రాజంపేట, జూలై 17 ప్రభాతవార్త**



శక్తి స్వరూపిణి వారాహి దేవి నవరాత్రులు రాజంపేటలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జాతీయ రహదారిలో అయ్యప్ప ఆలయంలోనూ, ఊటుకూరు శివాలయంలోను నవరాత్రి వేడుకల్లో భాగంగా వారాహి దేవి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం ,రాత్రి అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు పాటు నవరాత్రులు జరుగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. చివరి రోజు అమ్మవారికి వారాహి ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమం ఏర్పాటు చేస్తారు.

# షైనింగ్ స్టార్స్ అవార్డ్స్‌కు శ్లోక హైస్కూల్ విద్యార్థి

**వేంపల్లె జూలై 17 ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమానికి వేంపల్లిలోని శ్లోక హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ని హరిణి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నవనేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. తమ పాఠశాల నుంచి హరిణి విద్యార్థిని ఈ అవార్డులకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల అంకితభావంతో కూడిన బోధన ఫలితంగానే ఈ గౌరవం దక్కిందన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

# హాస్టళ్లను తనిఖీ చేసిన ఎస్సీ కమిషన్ చైర్మన్



**బ్రహ్మంగారిమఠం జూలై 17 ప్రభాతవార్త**

మండలంలో ముదుమాల గుండాపురంలో గత ఫిబ్రవరి నెలలో అనుమానాస్పదగా మృతి చెందిన దళిత యువకులు సతీష్ ఓబులేసు వారి చిత్రపటాలకు పూల వేసి ఎస్సీ కమిషన్ చైర్మన్ కే ఎస్ జవహర్ నివాళలర్పించారు. అనంతరం బాధితుల కుటుంబాలను ఓదార్చి వివరాలను అడిగి, తెలుసుకొని కేసులోని అసలు వాస్తవాలు బయటకు తీసేందుకు ఒక ఐపిఎస్ అధికారి ఆధ్వర్యంలో విచారణ జరపాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మరియు ఎస్సీ హాస్టల్‌ను ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలోని విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వసతులు, భోజన నాణ్యత, తాగునీరు, విద్యా సౌకర్యాలు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తెలిపిన సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. అక్కడ హాస్టల్‌లోనే భోజనం చేశారు. ఆయన వెంట బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య, హాస్టల్ వార్డెన్లు, పోలీసు సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీ ధరలకే యూరియా విక్రయం

**అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్సు రద్దు**

**అధిక ధర వసూలు చేస్తే రైతులు ఫిర్యాదు చేయాలి**

**మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి**



ఎరువు డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి

**పులివెందుల, జూలై 17 ప్రభాత వార్త :**

పులివెందుల మండలంలో యూరియాను నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించిన ఎరువుల డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వి. చెన్నారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొందరు డీలర్లు యూరియాను నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై ఎవరైనా అధిక ధరకు విక్రయించినట్లు తేలితే ఉన్నతాధికారులకు నివేదించి సంబంధిత డీలర్ల అనుమతి పత్రాన్ని రద్దు చేయించే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పులివెందుల మండలంలో యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. యూరియా, డి.ఏ.పి. ఎరువుల విక్రయాలు వ్యవసాయ శాఖ ప్రత్యేక విధానం ద్వారా నమోదు చేసి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఏ ఎరువుల డీలర్ అయినా యూరియాను నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు విక్రయిస్తే వెంటనే మండల వ్యవసాయ అధికారికి 8331057359 నంబరుకు సమాచారం అందించాలని రైతులకు సూచించారు. ఈ సమావేశంలో పులివెందుల మండలానికి చెందిన ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# ఇంటి వద్దనే టీబీ నిర్ధారణ పరీక్షలు



**ముద్దనూరు, జూలై 17 (ప్రభాతవార్త):**

ముద్దనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 5, 6 వార్డుల్లో శుక్రవారం పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా ఇంటి వద్దనే క్షయవ్యాధి (టీబీ) నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి మొత్తం 102 మందికి టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు సీహెచ్‌వో ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోర్టబుల్ ఎక్స్‌రే సాంకేతికతతో మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు కూడా సులభంగా టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స అందించి వ్యాధి వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రవిశంకర్, సూపర్‌వైజర్ శివ గంగ, రామారావు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాలపై అవగాహన



**పెండ్లిమర్రి, జులై 17, ప్రభాతవార్త:**

మండలంలోని జీసీ పల్లి హైస్కూలు మరియు కేజీబీవీ హైస్కూలు నందు ఉన్న బాలురు బాలికలకు బేటీ బచావో.. బేటీ పడావో మిషన్ వాత్సల్య మిషన్ శక్తి బాల్య వివాహాలపైన అవగాహన కార్యక్రమం ఆయా స్కూలు హెచ్ఎంల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. 1098, 181, 112, పోక్సో టోల్‌ఫ్రీ నంబర్లపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.షంషాద్‌బేగం, బి.కల్పన, హైస్కూలు హెడ్మాస్టర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బద్వేలు విద్యార్థి జయసింహా

**నీట్‌లో ఆలిండియా 42వ ర్యాంక్ సాధించి అరుదైన ఘనత**



**బద్వేలు అర్బన్, జూలై 17 ( ప్రభాతవార్త):**

బద్వేలు పట్టణానికి చెందిన యువకుడు మయుక్ జయసింహ జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష లో ఆలిండియా 42వ ర్యాంక్ సాధించి బద్వేలు పట్టణానికి విశేష గౌరవాన్ని తీసుకొచ్చాడు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని తన విజయంతో నిరూపించాడు. అతని ఈ ఘన విజయం పట్ల బద్వేలు పట్టణ ప్రజలు, విద్యార్థులు, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. మయక్ జయసింహ బద్వేలు పట్టణానికి చెందిన ప్రముఖ విద్యుత్ కాంట్రాక్టర్ నరసారెడ్డి మనవడు. ఆయన తల్లిదండ్రులు ఇద్దరూ బద్వేలు వాసులే కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో వైద్యులుగా సేవలందిస్తున్నారు. చిన్నప్పటి నుంచే వైద్య రంగంపై ఆసక్తి పెంచుకున్న జయసింహా, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమబద్ధంగా సిద్ధమయ్యాడు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడిన అత్యంత క్లిష్టమైన నీట్ పరీక్షలో ఆలిండియా 42వ ర్యాంక్ సాధించడం అతని ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. ఈ విజయం బద్వేలు పట్టణానికి గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే జాతీయ స్థాయిలో అత్యున్నత విజయాలు సాధించగలరనే విషయాన్ని మయక్ జయసింహ మరోసారి నిరూపించాడని కొనియాడారు. భవిష్యత్తులో దేశానికి సేవలందించే ఉత్తమ వైద్యుడిగా ఎదిగి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మయక్ జయసింహ సాధించిన ఈ ఘన విజయంపై మానవత సంస్థ అధ్యక్షులు నాగిరెడ్డి శంకరరెడ్డి, పారిశ్రామికవేత్త రాధాకృష్ణారెడ్డి, పలువురు విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి బద్వేలు పేరును దేశవ్యాప్తంగా మరింతగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.

# స్థానిక చరిత్రలపై ఎమ్మార్వోకు మక్కువ ఎక్కువ



**ఖాజీపేట జూలై 17 ప్రభాతవార్త**

ఒక రెవెన్యూ అధికారి స్థానిక చరిత్రల పై మక్కువ కలిగి ఉండడం ఎంతో అభినందనీయమని ఖాజీపేట మండల రెవెన్యూ అధికారి ఎం క్రాంతి కుమార్ ఇప్పటికే మండలంలోని అనేక గ్రామాల స్థానిక చరిత్రను తెలుసుకోవడం శుభపరిణామని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. క్రాంతి కుమార్ చేస్తున్న కృషిని కొనియాడుతూ రచయితల సంఘం వారు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గతంలో క్రాంతికుమార్ అనంతపూర్ జిల్లాలో పనిచేసేటప్పుడు అక్కడ స్థానిక చరిత్రలను పరిశోధించి అక్షరబద్ధం చేశారని, ఇక్కడ ఎమ్మార్వోగా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇప్పటికే ఈ ప్రాంతంలో ఉన్న ఖాజీపేట, పత్తూరు, తుడుమలదిన్నె తదితర గ్రామ చరిత్రలను తెలుసుకున్నారని అన్నారు. రచయితల సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య ప్రసంగిస్తూ క్రాంతి కుమార్ గ్రూప్ 2, కళాశాల అధ్యాపకులు, వీఆర్వోలు, పంచాయితీ సెక్రటరీస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు అనుకూలంగా ఆంధ్రుల చరిత్ర సంస్కృతి సంస్కృతి అనే గొప్ప గ్రంథాన్ని వెలువరించడం అభినందనీయమని అన్నారు. సన్మాన గ్రహీత ఎమ్మార్వో క్రాంతి కుమార్ స్పందిస్తూ నేను ఉద్యోగరీత్యా ఇక్కడికి వచ్చిన తర్వాతనే ఈ ప్రాంత విశిష్టత అర్థమైందని, ముఖ్యంగా ఉత్తర హరివంశం అనే కావ్యాన్ని రాసిన నాచన సోమనాథుడు తుడుమల దిన్నె నివాసి కావడం, కవి చౌడప్ప పుల్లూరు ప్రాంతంలో నివసించడం తనకు గొప్ప అనుభూతినిచ్చిందని, చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో ఉద్యోగం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని, తప్పకుండా ఈ ప్రాంత స్థానిక చరిత్రలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తానని, జిల్లా రచయితల సంఘం వారు చిరు సన్మానం చేయడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో వెన్నపూస చెన్నారెడ్డి, మూల ఈశ్వర రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చిన్న అయ్యవారురెడ్డి, గణేష్ రెడ్డి, సానేపల్లె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెల్లటూరులో స్మార్ట్ కిచెన్ ప్రారంభం



**పెండ్లిమర్రి, జులై 17, ప్రభాతవార్త:**

వెల్లటూరు హైస్కూల్ నందు శుక్రవారం స్మార్ట్ కిచెన్‌ను ఎంఈవో–2 గంగాధర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు మొదటి రోజు వెల్లటూరు హైస్కూలు ప్రైమరీ స్కూలు విద్యార్థులకు భోజనాలు అందించారు. భోజనాలు బాగున్నాయని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దువ్వూరు, జూలై 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చింతకుంట, మీర్జఖాన్ పల్లె తదితర ప్రాంతాల్లో ఉన్న సబ్ స్టేషన్ల పరిధిలో 11కేవి మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాజకుమార్ తెలిపారు. చింతకుంట పరిధిలోని రామాపురం, మనేరాంపల్లె, మీర్జఖాన్ పల్లె, చింతకుంట గ్రామంలోనూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంత ప్రజలు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు
# ఆధునిక వంట సామగ్రి పంపిణీ

**ప్రొద్దుటూరు అర్బన్ , జులై 17, ప్రభాతవార్త**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రొద్దుటూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 232 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలను శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ జి. నీరజ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల మౌలిక వసతుల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఇండక్షన్ స్టవ్‌లు వినియోగించడం ద్వారా వంట ప్రక్రియ మరింత సులభతరంగా, పరిశుభ్రంగా సాగుతుందని తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించడంలో ఈ సామగ్రి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని పంపిణీ చేసిన సామగ్రిని స్వీకరించారు. కేంద్రాల్లో అందుతున్న సేవలను మరింత మెరుగుపర్చేందుకు ఈ పంపిణీ దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.






